క్లుప్తంగా

మానసిక ఆరోగ్యానికి క్రీడలు అవసరం


క్యారమ్స్ ఆడుతున్న అధ్యాపకులు

దర్శి: మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది కలిసి ఇండోర్ క్రీడలు, చెస్, క్యారమ్స్, లెమన్ స్పూన్ రేస్ వంటి క్రీడలు నిర్వహించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ జి.వేణు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్వీ రమణ మాట్లాడుతూ జాతీయ క్రీడా హీరో ధ్యాన్ చంద్ అందించిన కృషిని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూత్ లెవల్లో సభ్యత్వాలు చేయాలి


మాట్లాడుతున్న తిండి నారాయణరెడ్డి

దర్శి: బూత్ లెవల్లో బీజేపీ సభ్యత్వాలు నమోదు చేసి పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి కోరారు. మండలంలోని రాజంపల్లిలో దర్శి రూరల్ మండల అధ్యక్షుడు కాకర్ల సాయి అధ్యక్షతన బీజేపీ మండల స్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా తిండి నారాయణరెడ్డి మాట్లాడుతూ బూత్ లెవల్ నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు ప్రతి పంచాయతీలో సభ్యత్వ నమోదు చేయడం కోసం ప్రతి మండల స్థాయి నాయకుడు కృషి చేయాలన్నారు. బీజేపీతోనే దేశం, రాష్ట్రం అభివృద్ధి సాధ్యం అవుతుందని, అలాంటి పార్టీని ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. మండలంలో అత్యధికంగా ఆన్‌లైన్ సభ్యత్వాలు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జేష్టాది ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇలా..ఎలా?


చెట్లతో కుంచించుకుపోయిన వీరాయపాలెం మేజర్


శిథిలావస్థలో దర్శి బ్రాంచి కాలువ హెడ్ రెగ్యులేటర్

- సాగుకు నీరు లేకున్నా.. సంఘాల ఎన్నికలకు సన్నద్ధం
- నిర్వహణ లేక చెట్లతో నిండిపోయిన మేజర్లు, మైనర్లు
- సిబ్బంది లేక వెలవెలబోతున్న కార్యాలయాలు, కాలువలు
- పదేళ్ల తర్వాత వెలుగులోకి వచ్చిన సాగునీటి సంఘాల ఊసు
- మరమ్మతుల పేరుతో దండుకోవచ్చని ఆశ పడుతున్న కూటమి నాయకులు
- మేజర్లు, మైనర్లు పునరుద్ధరించి సాగుకు నీరిచ్చి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్


కంప చెట్లు పెరిగి నడిచేందుకు వీల్లేని దర్శి బ్రాంచి కాలువ కట్ట

కురిచేడు:

సాగు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం ఆరాటపడుతోంది. అందుకు అనుకూలంగా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పదేళ్ల తర్వాత వచ్చిన సాగునీటి సంఘాల ప్రస్తావనతో నాయకుల్లో ఆశలు చిగురించాయి. పదేళ్లగా సాగుకు నీరు రాకపోవడం, కేవలం ఆరుతడి పంటలకు మాత్రమే నీరు ఇవ్వడంతో ప్రధాన కాలువతో పాటు మేజర్లు, మైనర్లు కంపచెట్లు, రిల్లు గడ్డితో పూడిపోయి కుంచించుకుపోయాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రపంచ బ్యాంకు నిధులతో కాలువల అభివృద్ధి, నాగార్జున సాగర్ డ్యామ్‌లో పూడికతీత పనులు చేపట్టారు. ఆ తర్వాత సాగర్ కాలువల నిర్వహణకు కూడా నిధులు విడుదల చేసిన ప్రభుత్వమే లేదు.

పెరిగిన ఆయకట్టు

నాగార్జున సాగర్ ఆయకట్టు స్థిరీకరణ కాలువ నిర్మాణ సమయంలో జరిగింది. గుంటూరు జిల్లాలో 2.47 లక్షల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 1.90 లక్షల ఎకరాలు ఆయకట్టు, ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం గుంటూరు జిల్లాలో 4.22 లక్షల ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 2.59 లక్షల ఎకరాలు ఉంది. అది ప్రస్తుతం అంతకంతకూ పెరిగింది. అది ప్రస్తుతం దానికి రెట్టింపై కాలువ చివరి భూములకు నీరందని పరిస్థితి ఏర్పడింది. తాజాగా ఆయకట్టు స్థిరీకరణ చేసి, మేజర్లు, మైనర్లు అభివృద్ధి చేసి, బ్రిడ్జిలకు మరమ్మతులు చేసి సిబ్బంది కొరతను తీర్చిన తర్వాత ఎన్నికలు నిర్వహిస్తే మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. అలా కాకుండా ఎన్నికలు నిర్వహిస్తే రైతులకు ఎటువంటి మేలు జరగదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సాగు నీటి సంఘాలు ఈ మేజర్లకే..

నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ జిల్లా పరిధిలో కల్లూరు 1,2,3, నాంచారపురం, ముప్పగంగవరం, ఐనవోలు మేజర్లు ఉన్నాయి. దర్శి బ్రాంచి కాలువ పరిధిలో వీరాయపాలెం, చింతలచెరువు, ముక్కెళ్లపాడు 1,2, వేముల, దేవవరం, రజానగరం, బృందావనం 1,2,3 మేజర్లతో పాటు పడమిపాడు బ్రాంచి కాలువ ఉంది. నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంఇలా..ఎలా? తో ఆశావాహులు ఓటర్ల జాబితాలో తమ అనుయాయుల పేర్లు చేర్పించుకునే పనిలో బిజీ అయ్యారు. అధికార పార్టీ అండదండలతో పదువులు దక్కించుకుంటే కాలువల అభివృద్ధి పేరుతో పనులు చేసుకోవచ్చని, తద్వారా నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చని అంచనాలు వేసుకుంటున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్న తరుణంలో నీటి సంఘాలు ఎన్నికలు నిర్వహిస్తే కాలువలపై నిత్యం యుద్ధాలు తప్పవని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలకు నీరు సక్రమంగా రాక చివరి భూముల రైతులకు ఆరుతడి పంటలకు కూడా నీరందక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్యామ్‌ల నిండా నీరున్నా సముద్రానికి నీరు విడుదల చేస్తున్నా రేగానీ పంటకు నీరు ఇవ్వకుండా కలెక్టర్ ద్వారా ఆరుతడి పంటలకు నీరు విడుదల చేస్తామని ప్రకటించడం రైతులను నిరాశకు గురిచేసింది.

కేజీబీవీలో పడకేసిన పారిశుధ్యం


కేజీబీవీ ప్రహరీ వద్ద చెత్తాచెదారం

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ వెనుక మురుగు నిలిచిపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గోడ వెంట పెద్ద గుంత ఉంది. విద్యాలయం నుంచి వృథా నీటితో పాటు భోజనానికి ఉపయోగించిన తర్వాత ఉన్న వ్యర్థ పదార్థాలను అక్కడే వేయడంతో నిల్వ ఉన్న మురుగుపై ఈగలు, దోమలు వాలి స్వైర్య విహారం చేస్తున్నాయి. పక్కనే బాలికలు భోజనాలు చేసే హాలు ఉంది. భోజనం తినే సమయంలో భరించలేని దుర్వాసన వెదజల్లుతోందని బాలికలు వాపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. బాలికలకు జ్వరాలు రావడంతో అక్కడే ఉన్న ఏఎన్‌ఎం చికిత్స చేస్తున్నారు. అప్పటికీ జ్వరం తగ్గక పోవడంతో ఉపాధ్యాయుల అనుమతితో వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు. విద్యాలయం పక్కనే పొలాలకు వెళ్లే రహదారి కావడంతో రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అటు వైపు వెళ్లే వారు దుర్వాసన వెదజల్లడంతో ముక్కు మూసుకొని వెళ్తున్నారు. మురుగు నిలిచిపోవడంతో ఈగలు, దోమలు ప్రబలి జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో పారిశుధ్యం క్షీణిస్తే మరిన్ని సమస్యలు తలెత్తే ముంపు ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు, ఆరోగ్య సిబ్బందికి చెప్పినా పట్టించుకున్న దాఖాలు లేవని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏ రోజు మురుగుపై బ్లీచింగ్ చల్లిన పాపానా పోలేదని స్థానికులు చెప్పారు. సమావేశాల్లో మాత్రం మండల అధికారులు, కూటమి నాయకులు పాఠశాలల్లో పర్యటించామని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యాలయం ప్రాంగణంలో కాలువలు నిర్మించి మురుగు నీరు చివరి వరకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తిరుమలనాథస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి


అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు

పెద్దారవీడు: మండల పరిధిలోని రాజంపల్లి సమీపంలో వెలసిన కలియుగ దైవం శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం అనంతరం నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో అలంకరించిన తర్వాత భక్తులు విశేష పూజలు చేశారు. శ్రావణ మాసంలో చివరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీచక్ర కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు.

వై.పాలెం, దర్శి నియోజకవర్గాల్లో భారీ వర్షం


వై.పాలెం: బురదమయంగా మారిన పొగాకు పంట


వై.పాలెం: వర్షం నీటిలో మిరప పంట

- జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచనలు

యర్రగొండపాలెం: బంగాళ ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఈ వర్షాలు కురుస్తుండటంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉద్యాన పంటలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మేలు చేకూరినప్పటికీ ఖరీఫ్, రబీల్లో విత్తుకున్న మిరప, బొప్పాయి, అరటి, కంది, పత్తి పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఉద్యాన, వ్యవసాయాధికారులు పి.ఆదిరెడ్డి, కేవీ శేషారెడ్డి తెలిపారు. తక్షణమే తగు జాగ్రత్తలు తీసుకొని రైతులు పంటలను కాపాడుకోవాలనికోరారు. ఈ వర్షాలతో నారు మడుల్లో ఉన్న మిరప, కూరగాయల నారు కుళ్లు తెగులు సోకే అవకాశం ఉంటుంది. నారు మడుల్లో నీరు నిల్వకుండా కాల్వల ద్వారా బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా మాంకోజెబ్ లేదా రిడోమిల్ వంటి శిలీంద్ర నాశినులను నారు మీద పిచికారీ చేయాలి. ప్రస్తుతం నాటుకున్న బొప్పాయి, అరటి, మిరప, కూరగాయల పంటల్లో ముందుగా పొలంలో నిరు నిలబడకుండా జాగ్రత్తలు తీసుకొని వేరుకుళ్లు తెగులు సోకకుండా నివారించుకోవచ్చు. పొలాల్లో నీరు ఎక్కువగా ఉండటంతో వేర్లు గాలి సోకక భూమి నుంచి ఎటువంటి పోషకాలు తీసుకోలేక ముందుగా ఆకులు పసుపు రంగుకుమారి చనిపోయే అవకాశం ఉంది. దీని నివారణకు 19:19:19 మందును 10 గ్రాములు లీటరు నీటికి, సూక్ష్మపోషకాల మిశ్రమం (ఫార్ములా-6)లీటరు నీటికి 5 గ్రాముల ప్రకారం కలిపి అన్ని పంటలపై పిచికారీ చేసుకోవాలి. బొప్పాయి మొక్కలకు మొదళ్ల దగ్గర కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా రిడోమిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పోయాలని, దీనివలన వేరుకుళ్లు రాకుండా నివారించుకోవచ్చని వారు సూచించారు.

వీఆర్వోలు అందుబాటులో ఉండాలి

పుల్లలచెరువు: తుఫాన్ ప్రభావంతో పడుతున్న వర్షాలకు గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నయీమ్ అహ్మద్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో పడుతున్న వర్షాల కారణంగా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పాత మిద్దెల్లో రాత్రి వేళ ఉండరాదని, వేరే ప్రాంతంలో ఉండాలన్నారు. నాన్పుడి వానలు పడుతున్నందున మట్టి మద్దెలు కూలే అవకాశం ఉందని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వీఆర్వోలు కూడా గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఏదైనా ముఖ్య సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలని సూచించారు.

దర్శి: నియోజకవర్గంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. రెండు రోజులుగాకురుస్తున్న వర్షాలకు పంటలకు మంచి ఉపశమనం కలిగింది. తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలో పూడిక తీత పనులు చేపట్టక పోవడంతో రోడ్లలో నీరు బయటకు వెళ్లే దారిలేక రోడ్లు జలమయమయ్యాయి. రోజంతా ఎడతెరిపి లేకుండా వర్షం కుస్తుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పలు దుకాణాలు మూసి వేసి వ్యాపారులు ఇళ్లకు వెళ్లారు.


తాళ్లూరు: తూర్పుగంగవరంలో..


దర్శి: రోడ్డు పొడవునా నిలిచిన నీరు


త్రిపురాంతకం: అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

త్రిపురాంతకం: తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు తగిన జాగ్రత్తలు చెప్పాలన్నారు. అధికారులంతా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలతో ఉండాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కురిచేడు: తుఫాన్ కారణంగా ప్రజలను ఇబ్బందుల నుంచి కాపాడేందుకు సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జి.రజని కుమారి తెలిపారు. 24 గంటలపాటు మూడు షిప్టులుగా సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పి.రామకృష్ణ, కె. బాలనాగయ్యలు, ఫోన్ నెంబర్లు 94940 85431, 76610 12793, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కె. సాయికిరణ్, జి.నరేష్‌కుమార్ ఫోన్ నంబర్లు 80084 49143, 81791 77713, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు పి.పిచ్చయ్య, షేక్ పెద్ద మహ్మద్ ఫోన్ నంబర్లు 938197 9733, 63004 98598 సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ నెల 3వ తేదీ వరకు కంట్రోల్ రూమ్ పనిచేస్తుందని ఆమె పేర్కొన్నారు.

వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలి

ముండ్లమూరు (దర్శి): అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో వాగులు పొంగి పొర్లే ప్రమాదమున్నందున వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ వై.నాగరాజు సూచించారు. మండలంలోని వేంపాడు చిలకలేరు వద్ద శనివారం సాయంత్రం వాహనదారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్శి-అద్దంకి ప్రధాన రహదారి చిలకలేరు, తోడేళ్ల వాగులు పొంగి పొర్లే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కొద్దిపాటి వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నందున వాహన దారులు నిర్లక్ష్యంగా నీటి ప్రవాహంలోకి వెళ్లడం మంచిది కాదన్నారు. ఆయా ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ సిబ్బంది పహారా ఉంటారన్నారు. వారి సూచనలు విధిగా పాటించాలన్నారు. గ్రామాల్లో వర్షం కారణంగా పంట, ఆస్తి నష్టం జరిగితే రెవెన్యూ సిబ్బంది వెంటనే తెలియజేయాలన్నారు. తుఫాన్ తీరం దాటే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


ముండ్లమూరు: వేంపాడు వద్ద వాహనదారులకు సూచనలిస్తున్న తహసీల్దార్, ఎస్‌ఐ

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

దర్శి: విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని దర్శి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సయ్యద్ అబ్దుల్ కరీం సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు, గాలులతో రైతులకు సంబంధించిన కరెంట్ మోటార్లు, స్టార్టర్ డబ్బాలు, సర్వీస్ వైర్‌లు తడిసి ఉంటాయని, వాటిని ముట్టుకోవడం, వాటి వద్దకు వెళ్లడం చేయవద్దని చెప్పారు. అలాగే ఇంటికి సంబంధించిన సర్వీస్ వైర్లు, వేలాడే తీగలు, కరెంటు స్తంభాలు, ఇనుప స్తంభాలు, లైన్ మీద ఆనుకుని ఉన్న చెట్లుకొమ్మలు ముట్టుకునే ప్రయత్నాలు చేయవద్దన్నారు. రోడ్లపై, కాలువ గట్ల వద్ద, డొంకల్లో పోల్స్ వైర్లు తెగపడి ఉండే అవకాశాలు ఉన్నాయని అలాంటి ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎటువంటి విద్యుత్ సమస్యలు ఉన్న వెంటనే లైన్‌మెన్, ఏఈ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేయాలని సూచించారు.

అమర్‌సింగ్ సేవలు మరువలేనివి


అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యర్రగొండపాలెం: విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసిన అమర్‌సింగ్ నాయక్ సేవలు మరువలేనివని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు అమర్‌సింగ్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. 28 సంవత్సరాలపాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన ఆయన విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులను తన కుటుంబ సభ్యులుగా భావించి ప్రేమానురాగాలు పంచిపెట్టారని, సమయపాలన, అంకిత భావంతో తన విధులు నిర్వర్తించిన ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం అమర్‌సింగ్ నాయక్ దంపతులను ఉపాధ్యాయులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు శ్యాంరాజ్, తిరుపతి నాయక్, ఉపాధ్యాయులు రాములు నాయక్, సీఆర్‌ఎంటీ కోటేశ్వరరావు, మూర్తి, ఎల్లయ్య పాల్గొన్నారు.